సాక్షి
ప్రకాశం
బుధవారం | 15 | నవంబర్ | 2023



జగన్ చేసిన మేలు చూసి ఓటేయండి
సీఎం జగన్ ప్రజలకు చేసిన మేలు చూసి ఓటేయాలని జెడ్పీచైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ కోరారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. - 8లో..



పుస్తక పఠనాన్ని ప్రోత్సహించాలి
విద్యార్థుల్లో చదివే అలవాటును ప్రోత్సహించాలని కలెక్టర్ దినేష్ కుమార్ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాలను ఆయన ప్రారంభించారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
31.1/24.8

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. పొగమంచు కురుస్తుంది. తేమ శాతం అధికం.

న్యూస్‌రీల్

జనం మెచ్చిన పాలన

● విశాఖ, అనకాపల్లి, విజయనగరం జిల్లాల వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి



మాట్లాడుతున్న వైవీ సుబ్బారెడ్డి

ఒంగోలు: ప్రస్తుత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం జనం మెచ్చే విధంగా తెలుగుదేశం పార్టీ కన్నా మెరుగైన పాలన అందిస్తోందని విశాఖ, అనకాపల్లి, విజయనగరం జిల్లాల వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. మంగళవారం ఒంగోలు వచ్చిన ఆయన, మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. టీడీపీ హయాంలో ఉచిత ఇసుక పేరుతో దోపిడీ జరిగిందనీ, నేడు ప్రభుత్వం పారదర్శక పాలసీ తీసుకొచ్చి ఆ దోపిడీకి అడ్డుకట్ట వేయడంతోపాటు ప్రభుత్వానికి ఆదాయం తీసుకొచ్చిందన్నారు. గెలుపు అభ్యర్థులకే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీట్లు ఇస్తారన్నారు. తమ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలు, వాటిని అందుకున్న కుటుంబాలకు మేలు జరిగితేనే ఓటేయమని సీఎం విజ్ఞప్తి చేస్తున్నారని తెలిపారు. తాజాగా చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్రకు ప్రజల నుంచి వస్తున్న స్పందనతో ప్రతిపక్షాల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని, అందుకే మేనిఫెస్టోలు విడుదల చేసుకునే పనిలో పడ్డాయన్నారు. తమ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుకున్న వారంతా తమకే పట్టం కడతారని వైవీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు.

నేటి నుంచి జన జాతీయ గౌరవ దివస్ వేడుకలు

ఒంగోలు సెంట్రల్: ప్రకాశం జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం నుంచి ఈనెల 26వ తేదీ వరకు కలెక్టర్ ఆదేశాల మేరకు జన జాతీయ గౌరవ దివస్ వేడుకలు నిర్వహిస్తారని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి జగన్నాథరావు తెలిపారు. ఆయా కార్యక్రమాలు గిరిజన భవన్‌లో జరుగుతాయని చెప్పారు.

సహకార రంగాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి

● పీడీసీసీ బ్యాంకు చైర్మన్ వై.ఎం.ప్రసాద్‌రెడ్డి



జెండా ఆవిష్కరించిన పీడీసీసీ బ్యాంకు చైర్మన్ వై.ఎం.ప్రసాద్‌రెడ్డి

ఒంగోలు సిటీ: సహకార రంగాన్ని మూడు అంచన వ్యవస్థతో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని పీడీసీసీ బ్యాంకు చైర్మన్ వై.ఎం. ప్రసాద్‌రెడ్డి (బన్నీ) అన్నారు. మంగళవారం 70వ సహకార వారోత్సవాల సందర్భంగా ఒంగోలులోని కేంద్ర సహకార బ్యాంకు కార్యాలయంలో జెండాను పీడీసీసీ చైర్మన్ ప్రసాద్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ నవంబరు 14 నుంచి 20 వ తేదీ వరకు సహకార వారోత్సవాలు జరుగుతున్నాయని, రోజుకు ఒక అంశంపై చర్చ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం 'భారతదేశాన్ని 5 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థగా పెంచడంలో, పర్యావరణ అనుకూల అభివృద్ధి లక్ష్యాల సాధనలో సహకార సంఘాల పాత్ర' అనే అంశం పై ప్రధానంగా చర్చ నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బ్యాంకు సీఈఓ వై.ప్రకాష్, డీసీఓ రాజశేఖర్, డి.ఆర్ (ఫ్యాకల్టీ) ఎం.కనకదుర్గారెడ్డి, బ్యాంకు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'మట్టి బండి' దీర్ఘకావ్యంపై సమీక్ష నేడు

ఒంగోలు మెట్రో: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం ఆరు గంటలకు నాగభైరవ సాహిత్య పీఠం ఆధ్వర్యంలో 'మట్టిబండి' దీర్ఘ కావ్యంపై సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు సాహిత్య పీఠం అధ్యక్షుడు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ రాచగొర్ల వెంకట సుశీల, కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి ముఖ్య అతిథులుగా పాల్గొంటారన్నారు. సాహితీవేత్తలు, సాహిత్యాభిమానులు అందరూ తప్పక పాల్గొనవలసిందిగా విజ్ఞప్తి చేశారు.

గేటు తీయగానే ఇంట్లో యజమాని కంటే ముందు మొక్కలు పలుకరిస్తాయి. ఎటుచూసినా సుగంధాలు వెదజల్లే వివిధ రకాల పూల మొక్కలు..కనువిందు చేసే రంగురంగుల పుష్పాలు.. సంపూర్ణ ఆరోగ్యానిచ్చే సేంద్రియ ఎరువులతో పండించిన కాయగూరలు, పండ్ల మొక్కలు దర్శనమిస్తాయి. రెండంతస్తుల భవనం..ఎటుచూసినా పచ్చని మొక్కలతో ఆహ్లాదకరమైన వాతావరణం కనిపిస్తుంది. ఒంగోలు సంతపేటలోని డి.విజయలక్ష్మి ఇంటి వద్ద కనిపించే దృశ్యాలు ఇవి. తొలి నాళ్లలో పూలమొక్కలు పెంచడం అలవాటు చేసుకున్న ఆమె సేంద్రియ ఎరువులతో సహజసిద్ధంగా రకరకాల కాయగూరలు..ఆకు కూరలు..పందిరి కాయగూరలు..వివిధ రకాల పండ్లను పండిస్తున్నారు. ఇంటి ముందున్న ఖాళీ స్థలం మొదలు భవనానికిరువైపులా ఉన్న స్థలంలో..మొదటి, రెండో అంతస్తుకు వెళ్లేందుకు ఏర్పాటు చేసుకున్న మెట్ల పైన.. రెండో అంతస్తులో 1000 చదరపు అడుగుల స్థలంలో మొక్కలు పెంచుతూ నందన వనంగా మార్చేశారు. ఆమె భర్త చెంచురామిరెడ్డి. వృత్తి రీత్యా డాక్టర్. ఇంట్లో నిత్యం వండుకునే ఆకుకూరలు..కాయగూరలు అన్నీ మేము పండించేవే.. రోజూ పూసే పూలతో దేవుడి గది అంతా నిండిపోతుందని మురిసిపోతూ చెబుతున్నారు. ఇలా ఒక్క విజయలక్ష్మే కాదు నగరంలో వందలాది మంది ఇంటి పంటలపై ఆసక్తి చూపిస్తూ తమ పెరట్లో రకరకాల మొక్కలు పెంచుతున్నారు.



మొక్కలు చూసుకుంటున్న విజయలక్ష్మి

ఇల్లే నందనవనం..

● ఇళ్లలో మొక్కల పెంపకంపై పెరుగుతున్న ఆసక్తి
● పూలు, పండ్లు, ఆకుకూరలు, కూరగాయల సాగు
● ప్రకాశం మిద్దెతోటల పెంపకం గ్రూప్ ఏర్పాటు
● మొక్కల పెంపకంపై అవగాహన





సాక్షిప్రతినిధి, ఒంగోలు: ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ చూపుతున్నారు. ఆహారపు అలవాట్లలో అనేక మార్పులు చేసుకుంటూ అనారోగ్యానికి దూరంగా ఉంటున్నారు. పల్లెల్లో, పట్టణాల్లో చాలా ఇళ్లలో పెరటి సాగు కనిపిస్తుంది. కూరగాయల సాగు ఏర్పాటు చేసుకుని స్వయంగా కూరగాయలు పండించుకుంటున్నారు. ఈ ఒక్క ఆలోచన వారి కుటుంబానికి సరిపడా పౌష్టికాహారం అందిస్తోంది. ఇంటి పైనే కూరగాయలు, పూలు, పండ్లు పండిస్తూ వాటినే వినియోగిస్తున్నారు. హైదరాబాద్, బెంగళూరు, మహారాష్ట్ర, తూర్పుగోదావరి జిల్లాలోని కడియం నర్సరీల నుంచి రకరకాల పూలు..పండ్ల మొక్కలను తెచ్చుకుంటున్నారు. అలాగే రకరకాల కాయగూరలకు సంబంధించిన విత్తనాలను వివిధ పట్టణాల నుంచి తెచ్చుకుంటున్నారు. ఇంటి పంటలపై ఆసక్తి ఉన్న హైదరాబాద్‌కు చెందిన తుమ్మేటి రఘోత్తమరెడ్డి నగరంలోని చాలా మందికి ఉచితంగా విత్తనాలను అందజేస్తున్నారు. అంతేకాకుండా మొక్కల పెంపకంపై పలు సూచనలు, సలహాలు ఇస్తున్నారు.

ఇంటిపంటలో పెంచుతున్న మొక్కలు ఇవి..

నగరంలో చాలా మంది ఇళ్లలో ఎక్కువగా పూలు, ఆకు కూరలు, కూరగాయలు, రకరకాల పండ్ల మొక్కలను పెంచుతున్నారు. వివిధ రకాల క్రోటన్స్, మందారం, బంతి, మల్లి, సన్నజాజి, గులాబి, తులసి, పత్తి మందారం, సంపంగిలతో పాటు బొప్పాయి, జామ, అరటి, మామిడి, సపోట, దానిమ్మ, ఆపిల్‌ను పండిస్తున్నారు. అలాగే బెండ, అరటి, దొండ, బీర, కాకరకాయ, సొరకాయ, పొట్లకాయ, టమోట, పచ్చిమిర్చి, గోరు చిక్కుడు, పందిరి చిక్కుడు, మునక్కాయలు తదితర కాయగూరలతో పాటు తోటకూర, మెంతికూరలను సైతం సాగుచేస్తున్నారు.

పత్తి మందారం



సంతపేట విజయలక్ష్మి ఇంట్లో వివిధ రకాల మందారం మొక్కలు ఉన్నాయి. అందులో పత్తి మందారం వెరీ స్పెషల్. ఇది తెలుపు రంగులో పూస్తుంది. మధ్యాహ్నానికి లేత పింక్ కలర్‌లోకి మారుతుంది. సాయంత్రానికి ముదరు పింక్ కలర్‌లోకి మారుతుంది. ఇలాంటి ఆసక్తి కలిగించే పూల మొక్కలు ఇక్కడ ఎన్నో ఉన్నాయి.

ప్రతి రోజూ గంట నుంచి రెండు గంటల శ్రమ..

ఇంట్లో మొక్కలు పెంచడం కోసం ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం సమయాల్లో ప్రత్యేక సమయాన్ని కేటాయిస్తున్నారు. ప్రతి రోజూ ఉదయం లేవగానే మొక్కలకు నీళ్లు పడతారు. మొక్కలకు ఏవైనా చీడ, పీడలు ఆశిస్తే వాటిని తొలగించి అవసరమైన చోట సహజసిద్ధ వనరులతో తయారు చేసిన మందులను స్ప్రే చేస్తారు. చాలా మంది సొంతంగా జీవామృతాన్ని, వేపనూనె, పిట్టు, పిడకలను తయారు చేసుకుంటున్నారు. మరి కొందరు గుంటూరు, విజయవాడ, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి తెచ్చుకుంటున్నారు. అలాగే నగరంలోని గోశాల నుంచి ఆవు ఎరువు, చుట్టుపక్కల ప్రాంతాల నుంచి గేదె ఎరువులను సేకరిస్తున్నారు. రెండు, మూడు నెలలకొకసారి మొక్కలన్నింటినీ అవసరమైన మందులు జల్లుతారు. ఈ ప్రక్రియ ఒకరోజు పడుతుంది. ఇలా చెట్లను సంరక్షిస్తూ తన ఇంటి పరిసరాలను ఆహ్లాదంగా ఉంచుతూ.. ఇంట్లోకి ఆరోగ్యకరమైన పండ్లను, కూరగాయలను పండించుకుంటున్నారు.



మారుతీనగర్‌లోని ఆలపాటి సుకన్య ఇంటి పెరటిలో మొక్కలు



విజయలక్ష్మి ఇంటిలోని మిద్దెతోట

ఆపిల్..



ఆపిల్ మొక్కను పెంచేందుకు సుకన్య ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ముందుగా ఆపిల్ విత్తనాలను 15 రోజుల పాటు ఫ్రిజ్‌లో ఉంచారు. మొలక వచ్చాక వాటిని కోకోపిట్‌లో ఉంచి తర్వాత కుండీలో పెట్టారు. మూడు సంవత్సరాల నుంచి దీనిని పెంచుతున్నారు. దీనిని తొట్టిలోంచి తీసి భూమిలో పాతాలి. ఐదు నుంచి ఏడేళ్లు వచ్చాక కాయలు కాస్తుందని చెబుతున్నారు సుకన్య.



వర్మికంపోస్టును పరిశీలిస్తున్న సుకన్య

ఎన్నో ఉపయోగాలు..

పూల మొక్కలతో పాటు సుందరీకరణ మొక్కలు పెంచడం ఆహ్లాదాన్ని ఇస్తుంది. కూరగాయల సాగు చేయడం ద్వారా రసాయనాలతో పండే కూరగాయలకు దూరంగా ఉంటూ మన చెట్లకు పండే కూరగాయలు తింటూ ఎంతో ఆరోగ్యంగా ఉండొచ్చు. పండ్ల మొక్కలు పెంచడం ద్వారా రసాయనాలు లేని పండ్లను తినొచ్చు. మార్కెట్లో దొరికే పండ్లలో రసాయనాలతోనే పెంచి రసాయనాలతోనే వారిని పండేలా చేస్తారు. దీంతో అందులో పోషకాలు అన్ని పోతాయి. ఇలా మన ఇంట్లో పండిన పండ్లను తినడం ద్వారా అందులో ఉండే పోషకాలన్నీ లభిస్తాయి.



ప్రకాశం మిద్దెతోటల పెంపకం గ్రూప్..

ఇంటి పంటలు పండించే వారి కోసం నగరంలో 'ప్రకాశం మిద్దెతోటల పెంపకం' అనే ప్రత్యేకమైన గ్రూపును ఏర్పాటు చేశారు. నగరంలోని మారుతీనగర్‌కు చెందిన ఆలపాటి సుకన్య అడ్మిన్‌గా ఉన్నారు. ఆమెతో పాటు సంతపేటకు చెందిన డి.విజయలక్ష్మి ప్రధానంగా ఉంటూ ఇంటి పంటలు పండించే వారిని ప్రోత్సహిస్తున్నారు. ఈ గ్రూప్‌లో ఇప్పటి వరకూ 130 మందికి పైగా సభ్యులు ఉన్నారు. వారికి అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తున్నారు. హైదరాబాద్ నుంచి రఘోత్తమరెడ్డి, రిటైర్డ్ బ్యాంకు ఆఫీసర్ అప్పారావు తదితరులను తీసుకువచ్చి సలహాలు సూచనలు ఇప్పిస్తున్నారు. దాదాపు మూడేళ్లుగా ఈ గ్రూపు నడుస్తోంది. ఇంటి పంటలపై ఆసక్తిని పెంచేందుకు నిరంతరం సమావేశాలు నిర్వహిస్తామని అడ్మిన్ సుకన్య చెబుతున్నారు.



గోరుచిక్కుడు

సొంతంగా ఎరువుల తయారీ..

మామగారు ఆలపాటి సత్యనారాయణ పొగాకు వ్యాపారి. ఆయన బెంగళూరు నుంచి రకరకాల పూల మొక్కలను తీసుకొచ్చేవారు. అలా ఇంట్లో మొక్కలు పెంచడం అలవాటైంది. క్రమంగా కాయగూరలు, పండ్ల మొక్కలు పెంచడం అలవాటు చేసుకున్నా. కిచెన్ వేస్ట్‌తో ఎరువులు తయారు చేస్తున్నా. జీవామృతాన్ని కూడా సొంతంగా తయారు చేసుకుంటున్నా. సేంద్రియ ఎరువులను సైతం తయారు చేస్తున్నా. అమెరికాలో ఉంటున్న కుమారుడు సైతం రకరకాల కాయగూరలను పెంచుతున్నారు. పెరటి మొక్కల పెంపకంపై నగరవాసులకు ఆసక్తిని పెంచేందుకు మూడేళ్ల కిందట ప్రత్యేక గ్రూప్‌ను ఏర్పాటు చేశాం. ప్రసుతం 130 మంది సభ్యులు ఉన్నారు. రానున్న రోజుల్లో గ్రూప్‌ను మరింత విస్తరించేలా కార్యక్రమాలు చేపట్టనున్నాం.
– ఆలపాటి సుకన్య, మారుతీనగర్, ఒంగోలు





ఐదేళ్ల నుంచి..

మొదట్లో పూల మొక్కలు పెంచా. ఆ తర్వాత సేంద్రియ ఎరువులతో ఇంట్లోనే ఆకుకూరలు, కాయగూరలు, పండ్లు పెంచుతున్న విధానాన్ని తెలుసుకున్నా. వాటి పెంపకంపై ఆసక్తి పెరిగింది. రకరకాల పూల మొక్కలతో పాటు కాయగూరలు, పండ్లను పెంచుతున్నా. రెండో అంతస్తులో వీటిని పెంచుతున్నా. తొలినాళ్లలో వీటిని సంరక్షించేదాన్ని. ఆరోగ్యం సహకరించక పోవడంతో ఇంట్లో పనిచేస్తున్నా భార్య, భర్తలు ఇద్దరూ నాలుగు నెలలుగా మొక్కలు సంరక్షిస్తున్నారు. సహజసిద్ధమైన ఎరువులతో పండిస్తున్న కూరగాయలు తినడంతో సంతృప్తినిస్తోంది.
– డి.విజయలక్ష్మి, సంతపేట, ఒంగోలు

ఉత్సాహంగా జేఎన్‌టీయూకే క్రీడా పోటీలు

ఒంగోలు సెంట్రల్: జేఎన్‌టీయూకే ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సెంట్రల్ జోన్ పోటీలు మంగళవారం ఒంగోలు కృష్ణసాయి ప్రకాశం గ్రూప్ కళాశాలలో ప్రారంభమయ్యాయి. కళాశాల సెక్రటరీ శిద్దా హనుమంతరావు, కోశాధికారి శిద్దా భరత్, యూనివర్సిటీ క్రీడల కార్యదర్శి డాక్టర్ జీపీ రాజు, రిటైర్డ్ పీడీ కే అమ్మయ్యలు ముఖ్య అతిథులుగా పాల్గొని క్రీడాకారుల గౌరవ వందనం స్వీకరించి ఆటల పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సెక్రటరీ శిద్దా హనుమంతరావు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆటలకు ప్రాముఖ్యత ఇవ్వాలని, అందుకు అవసరమైన బాస్కెట్ బాల్, టెన్నిస్ కోర్టులు ప్రపంచ స్థాయి ప్రమాణాలతో తయారు చేయించినట్లు చెప్పారు. క్రీడలు విద్యార్థుల మానసిక ఉల్లాసానికి ఎంతగానో ఉపయోగపడతాయని, గెలుపోటములు సమానంగా స్వీకరించి ముందుకు సాగాలని కోశాధికారి శిద్దా భరత్, కళాశాలల ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఏవీ భాస్కర్‌రావు, డాక్టర్ కేవీ సుబ్రహ్మణ్యం, జేవీ రమేష్ కోరారు. క్రీడలు



క్రీడా జ్యోతిని వెలిగిస్తున్న అతిథులు



కబడ్డీ ఆడుతున్న ఉమెన్స్ బృందం

కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించనున్నట్లు కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఏవీ భాస్కర్ రావు తెలిపారు. రైజ్ కళాశాలలో రెండో సారి ఈ క్రీడలు నిర్వహించటం హర్షించదగ్గ విషయమని, క్రీడా సదుపాయాలు, టోర్నమెంట్ నిర్వహణకు రైజ్ కళాశాల యాజమాన్యం కృషి అభినందనీయమని యూనివర్సిటీ క్రీడల కార్యదర్శి, పరిశీలకులు డాక్టర్ జీపీ రాజు అన్నారు. ఈ క్రీడల్లో జేఎన్‌టీయూకే పరిధిలోని 5 జిల్లాల్లో ఉన్న 32 కళాశాల నుంచి 500 మంది క్రీడాకారులు పాల్గొన్నారని పీడీలు ఎస్ హిమచంద్రబాబు, ఎస్ సుబ్బారావు, కోఆర్డినేటర్ కే వీరాంజనేయులు తెలిపారు. ఈ పోటీల్లో బాలికల కబడ్డీ విభాగంలో 22 జట్లు పాల్గొనగా పూల్-ఏ నుంచి రైజ్ కృష్ణసాయి గాంధీ, సీఆర్ రెడ్డి, హేలాపురి, పీడలురు ఇంజినీరింగ్ కళాశాలలు, పూల్-బీ నుంచి రైజ్ క్రిష్ణసాయి ప్రకాశం, ఎస్టీ మారీస్ ఇంజినీరింగ్ కళాశాల, ఎస్ఆర్‌జీఈసీ గుడ్లవల్లూరు కాలేజిలు రెండో రౌండ్‌కు అర్హత పొందాయని చెప్పారు. ఈ టోర్నమెంట్‌లు నాక్ ఔట్ పద్ధతిలో నిర్వహిస్తున్నట్లు ఫిజికల్ డైరెక్టర్లు వివరించారు.

బాలల హక్కులపై అవగాహన కల్పించాలి



బాలల హక్కుల వారోత్సవాల ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

● ర్యాలీ ప్రారంభించిన కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: బాలల హక్కులు, బాలల దత్తత గురించిన అవగాహన ప్రతి ఒక్కరికీ ఉండాలని, ఆ దిశగా సంబంధిత అధికారులు కృషి చేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. బాలల హక్కుల వారోత్సవాలను పురస్కరించుకుని కలెక్టరేట్ వద్ద ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. బాలల దినోత్సవం సందర్భంగా జాతీయ బాలల హక్కుల కమిషన్, వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో బాలల దత్తత, వారి హక్కుల గురించి అవగాహన కల్పించే లక్ష్యంతో ర్యాలీని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. అందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించి బాలల స్వేచ్ఛకు చిహ్నంగా తెల్ల పావురాలను ఎగురవేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నవంబర్‌ను బాలల దత్తత నెలగా కేంద్రం ప్రకటించిన మేరకు అవగాహన కల్పించేలా వారోత్సవాలు చేపడుతున్నామన్నారు. బాలికల హక్కులు కాపాడటం, బాల్య వివాహాల నివారణపై కూడా ప్రజలకు చైతన్య పరుస్తామని చెప్పారు. జిల్లాలో బాల్య వివాహాల నివారణకు మండల, గ్రామ స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేసి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆడపిల్లలు మధ్యలో స్కూలు మానేయకుండా కనీసం ఇంటర్మీడియెట్ వరకు చదివేలా బాలికా వికాసం పేరుతో ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. సచివాలయ పరిధిలో ప్రతి వివాహాన్ని మహిళా పోలీసులతో ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేస్తున్నామన్నారు. గత నెలలో 21 బాల్య వివాహాలను అడ్డుకున్నామని చెప్పారు.

రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి, జిల్లా బాలల సంక్షేమ కమిటీ చైర్మన్ వీ రామాంజనేయులు మాట్లాడుతూ బాలలకు ఉన్న హక్కులపై వారి తల్లిదండ్రులకు కూడా అవగాహన కల్పిస్తామన్నారు. పిల్లలకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే టోల్ ఫ్రీ నంబర్1098కు ఫోన్ చేయాలన్నారు. దీనిలో ఐసీడీఎస్ పీడీ మాధురి, మెప్మా పీడీ రవికుమార్, విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ అర్చన, ఇన్‌చార్జ్ డీసీపీవో ప్రమోద్‌కుమార్, ఎస్సీసీ జిల్లా కో ఆర్డినేటర్ కిరణ్, ఎంఈఓ కిషోర్ కుమార్, సీడీపీవోలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జలజీవన్ మిషన్ పనులు వేగంగా పూర్తి చేయాలి

● కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: జిల్లాలో జలజీవన్ మిషన్‌కు సంబంధించిన పనులు వేగంగా పూర్తిచేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై మండల స్థాయి అధికారులతో ప్రకాశం భవనం నుంచి వీడియో సమావేశం నిర్వహించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ జలజీవన్ మిషన్ పనుల్లో వారాంతపు లక్ష్యాలను సాధించాలన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ పనులు పూర్తి చేయాలన్నారు. దీనికి సంబంధించి పంచాయతీల్లో కమిటీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నిర్మాణ పనులు పూర్తయిన తర్వాత గ్రామ సభ ఏర్పాటు చేసి కుళాయి నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఉపాధి హామీ పనుల్లో ఎస్సీ, ఎస్టీలకు వంద రోజుల పనిదినాలను ఖచ్చితంగా కల్పించాలన్నారు. సచివాలయాల్లో ప్రభుత్వ సేవలకు సంబంధించి నగదును ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి జమ చేయాలన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని చెప్పారు. స్వమిత్వ సర్వే పక్కాగా నిర్వహించి సకాలంలో పూర్తి చేయాలన్నారు. సమావేశంలో సీపీవో వెంకటేశ్వర్లు, జెడ్పీ సీఈఓ జాలిరెడ్డి, డీపీవో నారాయణ రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ రవికుమార్, పంచాయతీరాజ్ ఎస్ఈ కొండయ్య, మత్స్యశాఖ జేడీ చంద్రశేఖర్‌రెడ్డి, హౌసింగ్ పీడీ పేరయ్య, సచివాలయాల నోడల్ అధికారి ఉషారాణి ఇతర అధికారులు పాల్గొన్నారు. ముందుగా రెవెన్యూ అంశాలపై జేసీ శ్రీనివాసులుతో కలిసి సమీక్షించారు.



వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, డీపీవో నారాయణరెడ్డి

ఎస్పీని కలిసిన ట్రైనీ డీఎస్పీ



ఎస్పీ మలికా గర్గ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ట్రైనీ డీఎస్పీ షహబాజ్

ఒంగోలు టౌన్: శిక్షణ నిమిత్తం జిల్లాకు వచ్చిన ట్రైనీ డీఎస్పీ షేక్ షహబాజ్ మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ మలికా గర్గ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణ, నేరని యంత్రణలో విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకోవాలని సూచించారు. మార్కాపురం సబ్ డివిజన్ పరిధిలో ఆరు నెలలపాటు డీఎస్పీ షహబాజ్ శిక్షణ పొందనున్నారు.

మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తి అరెస్టు

మార్కాపురం: వైద్యానికి వెళ్లిన మహిళలకు చికిత్స చేసే నెపంతో వారికి తెలియకుండా అసభ్య చిత్రాలు తీస్తున్న ప్రైవేట్ క్లినిక్ కాంపౌండర్ బొందిలి రాంసింగ్‌ను మంగళవారం అరెస్టు చేసినట్లు పట్టణ ఎస్సై కోటేశ్వరరావు తెలిపారు. స్థానిక కళాశాల రోడ్డులోని ఓ ప్రైవేట్ లాడ్జి ఎదురుగా ఉన్న ఆయుర్వేద వైద్యుని వద్ద కాంపౌండర్‌గా పనిచేస్తున్న రాంసింగ్ సోమవారం సాయంత్రం చికిత్స కోసం వచ్చిన మహిళకు ఇంజక్షన్ చేసే నెపంతో అసభ్యకరంగా ఫొటోలు తీస్తుండగా కుటుంబ సభ్యులు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి, అతడి సెల్‌ఫోన్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనను తీవ్రంగా పరిగణిస్తున్నామని ఎస్సై తెలిపారు. నిందితుడి సెల్‌ఫోన్‌లో దృశ్యాలు చూసి పోలీసులు సైతం విస్తుపోయారు.

జగన్ చేసిన మేలును చూసి ఓటేయండి

- చంద్రబాబుకు ఓటేసి మళ్లీ మోసపోకండి
- సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగనే సీఎం కావాలి
- జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్, మాజీ ఎమ్మెల్యే శివప్రసాదరెడ్డి


బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి


స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ.25.2 కోట్ల చెక్ అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

చీమకుర్తి: ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు చేసిన మేలును చూసే వచ్చే ఎన్నికల్లో ఓటేయ్యండని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు అన్నారు. మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డితో కలిసి మంగళవారం చీమకుర్తి మున్సిపాలిటీలోని 5వ సచివాలయం పరిధిలో ఏర్పాటు చేసిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నాలుగున్నరేళ్ల నుంచి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం అందిస్తున్న సంక్షేమ పథకాలు ఇలాగే కొనసాగాలంటే మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి రావాలని ఆకాంక్షించారు. చంద్రబాబుకు ఓటేసి మరోసారి మోసపోకండని పిలుపునిచ్చారు. 2014లో చంద్రబాబు అబద్ధపు హామీలు ఇచ్చి అధికారం చేపట్టాక ఇచ్చిన హామీలన్నీ తుంగలో తొక్కారని గుర్తు చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కసారి బటన్ నొక్కితే పేదల జీవితాల్లో వెలుగులు నిండుతాయని, మీరు కూడా వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపైనే బటన్ నొక్కాలని విజ్ఞప్తి చేశారు.

చంద్రబాబు పాలనలో జగన్ పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు చదివి వినిపించారు. అనంతరం స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ.25.2 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాల చెక్కును అందజేశారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. సంక్షేమ పథకాలకు సంబంధించిన పట్టికను సచివాలయం వద్ద ఆవిష్కరించారు. పార్టీ జెండాలతో సచివాలయం పరిధిలోని వీధులలో ర్యాలీ నిర్వహించి లబ్ధిదారుల ఇళ్లకు పార్టీ జెండాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బాపతు వెంకటరెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు వేమా శ్రీనివాసరావు, కమిషనర్ షేక్ ఫజుల్లా, మాజీ చైర్మన్ చల్లా అంకులు, వైస్ చైర్మన్ ఎస్.మాణిక్యం, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

రామచంద్రాపురంలో

రామచంద్రాపురంలో నిర్వహించిన ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, పార్టీ మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. సంక్షేమ పథకాల బుక్‌లెట్లను అందించిన వచ్చే ఎన్నికలలో జగన్‌కు ఎందుకు ఓటేయాలో వివరించారు. వైస్ ఎంపీపీ జ్యేష్ఠ శ్రీనివాసరావు, కడియాల మల్లికార్జున, తిరుపతిస్వామి, స్థానికులు పాల్గొన్నారు.

పుస్తక పఠనాన్ని ప్రోత్సహించాలి


గ్రంథాలయ వారోత్సవాల్లో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

- కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు మెట్రో: విద్యార్థుల్లో చదివే అలవాటును ప్రోత్సహించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. ఒంగోలు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన జాతీయ గ్రంథాలయాల వారోత్సవాలను కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో విద్యార్థుల్లో చదివే అలవాటును పెంపొందించాలన్నారు. చదవటం ఒక కళ అని, పుస్తకాలను ఏ విధంగా చదవాలో తమ వద్దకు వస్తున్న విద్యార్థులకు గ్రంథపాలకులు అవగాహన కల్పించాలని సూచించారు. సాంకేతిక యుగంలో ప్రజలకు అవసరమైన సమాచారాన్ని అందుబాటులో ఉంచేలా గ్రామస్థాయిలో డిజిటల్ లైబ్రరీ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని, జిల్లా యంత్రాంగం కూడా లైబ్రరీలకు మద్దతుగా ఉండి అవసరమైన సహకారాలు అందిస్తుందని తెలిపారు. పాఠ్య పుస్తకాలు మాత్రమే కాకుండా విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి, వివిధ అంశాలపై అవగాహన పెంచుకోవటానికి ఉపయోగపడే పుస్తకాలను కూడా స్కూల్స్ ప్రతివారం కనీసం మూడు గంటల పాటు చదివేలా చర్యలు తీసుకోవాలని విద్యా శాఖాధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని అన్ని గ్రంథాలయాలలో అవసరమైన సౌకర్యాలను కల్పించామన్నారు. రాష్ట్ర పౌర గ్రంథాలయ శాఖసంచాలకుడు ఎంఆర్ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ పుస్తక పఠనం ద్వారా విషయ పరిజ్ఞానం పెరగడంతో పాటు పరిపూర్ణ వ్యక్తిత్వం ఏర్పడుతుందన్నారు. విద్యార్థులు, ప్రజల అభిరుచికి తగినట్లు వివిధ పుస్తకాలను గ్రంథాలయాల్లో అందుబాటులో ఉంచుతామన్నారు. వీటికి సంబంధించిన వివరాలను తెలిపేలా బోర్డులు, ఫ్లెక్సీలు గ్రంథాలయాల్లో ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ రాచగొర్ల వెంకట సుశీల, కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి, ఉప గ్రంథపాలకురాలు బొమ్మల కోటేశ్వరి, మండల విద్యాశాఖాధికారి కిషోర్బాబు, త్రిపురాంతకం జెడ్పీటీసీ ఎం జాన్‌పాల్, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు దేశాభివృద్ధికి తోడ్పడాలి


మార్కాపురంలో జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న ఎమ్మెల్యే కేపీ, నాయకులు


విద్యార్థులకు దుస్తులు అందజేస్తున్న ఎమ్మెల్యే అన్నా

- ఎమ్మెల్యే కేపీ

మార్కాపురం టౌన్: విద్యార్థులు బాగా చదివి దేశాభివృద్ధికి తోడ్పడాలని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి సూచించారు. మంగళవారం చిల్డ్రన్స్ డే సందర్భంగా జణగణమన సేవా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో 100 అడుగుల జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. మార్కాపురంలో క్రమం తప్పకుండా జాతీయ గీతాలాపన చేస్తున్న రెడ్డి సంక్షేమ సంఘ సభ్యులను అభినందించారు. అనంతరం అల్పాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, శ్రీశైలం ట్రస్టు బోర్డు మెంబర్ డాక్టర్ కనకదుర్గ, బుశ్శెట్టి నాగేశ్వరరావు, బీజేపీ నేత పీవీ కృష్ణారావు, హెచ్‌ఎం చంద్రశేఖర్‌రెడ్డి, రెడ్డి సంక్షేమ సేవా సంఘ నాయకుడు గుంటక సుబ్బారెడ్డి, అల్పాహార దాతలు నటరాజ్ ప్రసాద్, కె.ఆత్మానందరావు తదితరులు పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: నెహ్రూ జన్మదినం సందర్భంగా జరుపుకునే బాలల దినోత్సవాన్ని ప్రతి చిన్నారి సంతోషంగా గడపాలని ఎమ్మెల్యే అన్నా రాంబాబు అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా పాఠశాలలోని సరస్వతి విగ్రహానికి పూజలు చేశారు. అనంతరం నెహ్రూ చిత్రపటం వద్ద ఘనంగా నివాళులర్పించారు. ప్రతి విద్యార్థి వారి భవిష్యత్తు బంగారుమయం కావాలంటే శ్రద్ధతో విద్యను అభ్యసించాలని కోరారు. ప్రధానోపాధ్యాయుడు నాగభూషణ్‌రెడ్డి పాఠశాలలో చదువుకుంటున్న తల్లి లేదా తండ్రి లేని 96 మంది విద్యార్థులను గుర్తించి వారికి దుస్తులు అందజేశారు. విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేసిన సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు నాగభూషణ్‌రెడ్డిని ఎమ్మెల్యే అన్నా రాంబాబు అభినందిస్తూ సన్మానించారు. ఎంపీపీ కడప లక్ష్మి, మాజీ ఎంపీపీ కడప వంశీధరరెడ్డి, కౌన్సిలర్లు గడ్డం భాస్కర్ రెడ్డి, బాలిరెడ్డి, రిటైర్డ్ ఉపాధ్యాయుడు ఎం.రాంభూపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు భారతి, అనిత, గుర్రం శోభన్‌బాబు, ధనలక్ష్మి, లక్ష్మి పాల్గొన్నారు.

మానవ హక్కులపై పోలీసులకు డిబేట్


డిబేట్ నిర్వహిస్తున్న ఎస్బీ డీఎస్పీ మరియదాసు

ఒంగోలు టౌన్: మానవ హక్కుల ఉల్లంఘనపై సోషల్ మీడియా ప్రభావం-పోలీసులు, న్యాయవ్యవస్థ పాత్ర అనే అంశంపై జాతీయ స్థాయిలో నిర్వహించనున్న వక్తృత్వ పోటీలకు జిల్లా పోలీస్ శాఖ నుంచి ముగ్గురిని ఎంపిక చేశారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ మలికా గర్గ్ ఆధ్వర్యంలో స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ బి.మరియదాసు అధ్యక్షతన నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో 17 మంది పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. మానవ హక్కుల ఉల్లంఘనపై సోషల్ మీడియా ప్రభావం ఏ విధంగా ఉంటుంది, దాని వలన కలిగే ప్రయోజనాలు, అనర్థాలపై అభ్యర్థులు తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో ప్రసంగించారు. కాగా ఇంగ్లిష్ విభాగం నుంచి ఒంగోలు వన్‌టౌన్ ఎస్సై ఎం.మురళి, తెలుగు విభాగం నుంచి తర్లుపాడు కానిస్టేబుల్ స్వర్ణన్ రాజు, కనిగిరి కానిస్టేబుల్ షేక్ మౌలాలి ఎంపికయ్యారు. వీరిని గుంటూరు రేంజ్ స్థాయిలో నిర్వహించే పోటీలకు పంపించనున్నారు. న్యాయనిర్ణేతలుగా ఉపాధ్యాయులు రవికాంత్, రాము, రమణయ్య వ్యవహరించారు.

గుండెపోటుతో ఆర్టీసీ కండక్టర్ మృతి


ఖాశిం(ఫైల్)

పొదిలి: విధులకు హాజరయ్యేందుకు పొదిలి ఆర్టీసీ డిపోకు చేరుకున్న కండక్టర్ తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రికి తరలించేలోగా కన్నుమూశారు. ఈ సంఘటన సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. గిద్దలూరు మండలం పొదలకుంటపల్లె గ్రామానికి చెందిన ఖాశిం(55) పొదిలి ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా గత 18 ఏళ్ల నుంచి పనిచేస్తున్నారు. మంగళవారం తెల్లవారుజామున విధులకు హాజరుకావడం కోసం స్వగ్రామం నుంచి సోమవారం రాత్రి డిపోకు చేరుకున్నారు. వినుకొండ ఆర్టీసీ సర్వీస్‌లో విధులు నిర్వర్తించాల్సిన ఆయన ఒక్కసారిగా తీవ్ర అస్వస్థకు గురికావడంతో తోటి ఉద్యోగులు హుటాహుటిన స్థానిక వైద్యశాలకు తరలించారు. అప్పటికే ఖాశిం మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కండక్టర్ మృతిపై డిపో మేనేజర్ సుందరరావు, యూనియన్ నాయకులు, తోటి సిబ్బంది సంతాపం తెలియజేశారు.

లా కాలేజీలో అంతర్జాతీయ సెమినార్

- 16, 17న 'వేస్ట్ మేనేజ్‌మెంట్, రీసైక్లింగ్ అండ్ ఎన్విరాన్‌మెంట్'పై..
- ఏకేయూ వీసీ మారెడ్డి అంజిరెడ్డి వెల్లడి


సెమినార్ బ్రోచర్‌తో వీసీ అంజిరెడ్డి

ఒంగోలు: కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో 'వేస్ట్ మేనేజ్‌మెంట్, రీసైక్లింగ్ అండ్ ఎన్విరాన్‌మెంట్' అనే అంశంపై రెండు రోజులపాటు అంతర్జాతీయ సెమినార్ నిర్వహించనున్నట్లు వర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ మారెడ్డి అంజిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం యూనివర్సిటీలోని తన చాంబరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సెమినార్ వివరాలు వెల్లడించారు. ఈ నెల 16, 17 తేదీల్లో స్థానిక ఇందిరా ప్రియదర్శిని న్యాయ కళాశాల వేదికగా సెమినార్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఒంగోలులో అంతర్జాతీయ సెమినార్ నిర్వహించడం ఇదే ప్రథమమని చెప్పారు. ఇప్పటి వరకు 145 పరిశోధనా పత్రాలు అందాయని, వాటిలో 25 పత్రాలను వేదికపై వివరించేందుకు అవకాశం కల్పించామన్నారు. 145 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా విదేశాల నుంచి నలుగురు, తెలంగాణ నుంచి మరో 15 మంది వస్తున్నారన్నారు. డెన్మార్క్ నుంచి సారా పెట్రిసర్ హాన్సేన్, మలేషియా ప్రభుత్వ జాతీయ సర్క్యులర్ ఎకనామిక్ కౌన్సిల్ ప్రతినిధి డాక్టర్ ఎస్.ఉమేశ్వర, కొలంబో నుంచి శాంతలింగం సాయనాథన్, కేంద్ర మంత్రిత్వశాఖ నుంచి డాక్టర్ ఎస్.గ్లోరీ స్వరూపతో పాటు ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్, విశిష్ట అతిథిగా రీసస్టైనబులిటీ లిమిటెడ్ కంపెనీ ఎండీ, సీఈఓ ఎం.గౌతంరెడ్డి హాజరవుతారన్నారు.

జాతీయ స్థాయి నెట్‌బాల్ పోటీలకు పెదకొత్తపల్లి విద్యార్థిని


పాలేటి వరలక్ష్మి

మద్దిపాడు: మండలంలోని పెదకొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని పాలేటి వరలక్ష్మి ఎస్‌జీఎఫ్ జాతీయ స్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికైంది. ఈ నెల 9,10,11వ తేదీల్లో నెల్లూరు జిల్లా ఆత్మకూరులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఆమె సత్తా చాటినట్లు హెచ్‌ఎం వసంతకుమారి తెలిపారు. విద్యార్థినితోపాటు పీడీ రాజ్యలక్ష్మిని హెచ్‌ఎం, పీఎంసీ చైర్మన్ సరిత, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

కరాటేలో మార్కాపురం విద్యార్థి సత్తా


శివను అభినందిస్తున్న హెచ్‌ఎం చంద్రశేఖర్‌రెడ్డి, పీఈటీలు

మార్కాపురం టౌన్: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి పాముల సాయి వెంకటశివ విశాఖపట్నంలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ కరాటే పోటీల్లో బంగారు పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. మంగళవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో సాయి వెంకటశివతోపాటు పీఈటీ ఎం.జాహ్నవీ ప్రియ, కృష్ణగాడ్‌ను అభినందించారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు తూర్పుగంగవరం విద్యార్థి


విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

తాళ్లూరు(ముండ్లమూరు): మండలంలోని తూర్పుగంగవరం హైస్కూల్‌కు చెందిన జి.చందు జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పీడీ విజయకుమార్ మంగళవారం తెలిపారు. ఇటీవల కృష్ణా జిల్లా విజయవాడలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ అండర్-14 పోటీల్లో జి.చందు, ఎస్‌కే షబానా, ఎస్‌కే రషీదా పాల్గొని రెండో స్థానం సాధించారు. అత్యంత ప్రతిభ కనబరిచిన చందు ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక కావడంపై హెచ్‌ఎం అరుణకుమారి, పీఎంసీ చైర్మన్ రాజశేఖరరెడ్డి, జిల్లా కో ఆప్షన్ సభ్యులు షేక్ ఆదాషరీఫ్ అభినందించారు.

ఎస్సీ హాస్టల్లో జడ్జి తనిఖీ


విద్యార్థినులతో మాట్లాడుతున్న జడ్జి

మార్కాపురం: మార్కాపురంలోని ఎస్సీ బాలికల వసతి గృహాన్ని మంగళవారం జిల్లా ఆరో అదనపు న్యాయమూర్తి ఎం.శుభవాణి తనిఖీ చేశారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలతో ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా జాగ్రత్తగా చూసుకోవాలని సంక్షేమాధికారులకు స్పష్టం చేశారు. ఆమె వెంట న్యాయవాదులు ఉషశ్రీ, రామచంద్ర తదితరులు ఉన్నారు.

పారదర్శకంగా ఓటరు జాబితా


సమావేశం నిర్వహిస్తున్న ఆర్డీఓ విశ్వేశ్వరరావు

ఒంగోలు అర్బన్: ఓటరు జాబితా పూర్తి పారదర్శకంగా ఉండాలని అందుకు సంబంధిత అధికారులు, ఉద్యోగులంతా ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలని ఒంగోలు ఆర్డీవో విశ్వేశ్వరరావు అన్నారు. మంగళవారం ఆర్డీవో కార్యాలయంలో అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో స్పెషల్ సమ్మరీ రివిజన్‌పై సమావేశం నిర్వహించారు. దీనిలో ఆర్డీవో మాట్లాడుతూ ఓటరు జాబితాకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలన్నారు. బీఎల్ఏలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు అర్హత ఉన్న ప్రతి ఒక్కరి ఓటరుగా నమోదు చేసేలా కృషి చేయాలన్నారు. ఓఎంసీ డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు, డీటీ రఫీ, అర్జున్‌రెడ్డి, ఓఎంసీ ఏసీపీ కే వెంకటేశ్వర్లు, వైఎస్ఆర్ సీపీ ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్, ఇతర పార్టీల ప్రతినిధులు స్వరూప్, రసూల్, రాజశేఖర్, సత్యం, శ్రీదేవి పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం


రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్న అధికారులు

త్రిపురాంతకం: విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించి అక్రమంగా వాహనంలో తరలిస్తున్న రేషన్ బియ్యం సీజ్ చేశారు. మండలంలోని వెల్లంపల్లి వద్ద ఆత్మకూరు నుంచి త్రిపురాంతకం 52 ప్లాస్టిక్ బ్యాగుల్లో తరలిస్తున్న బియ్యం స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తిరుపతిరెడ్డి, రాఘవరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కుల గణనకు 61 మంది అధికారుల నియామకం

ఒంగోలు అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 27వ తేదీ నుంచి తలపెట్టిన కుల గణన సర్వేకోసం జిల్లాలో వివిధ శాఖలకు సంబంధించిన 61 మంది అధికారులను నియమించారు. సంబంధిత అధికారులకు శిక్షణ ఇచ్చేందుకు ఎంపిక చేసిన అధికారులతో పాటు సంక్షేమ శాఖల అధికారులకు రాష్ట్ర స్థాయి అధికారులు వీడియో సమావేశం ద్వారా శిక్షణ ఇచ్చారు. ప్రకాశం భవనం నుంచి జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఇతర అధికారులు పాల్గొన్నారు. కుల గణన సర్వేపై ఎంపికైన అధికారులు, కుల పెద్దలతో ఈ నెల 15వ తేదీ ప్రకాశంభవనంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తామని కలెక్టరేట్ వర్గాలు తెలిపారు.